ప్రజాశక్తి
www.prajasakti.com
I

లోతుగా దర్యాప్తు చేయండి

- అసలైన కారణాలను కనుక్కోండి
- గుల్జార్ హౌజ్ దుర్ఘటనపై సిఎం రేవంత్ దిగ్భ్రాంతి
- కుటుంబ సభ్యులకు సానుభూతి
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా
- అన్ని విధాలా ఆదుకుంటామని హామీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని గుల్జార్ హౌజ్‌లో సంభవించిన భారీ అగ్ని ప్రమాదంపై ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి విచారణకు ఆదేశించారు. ఈ ప్రమాదానికి గల అసలైన కారణాలను తెలుసుకునేందుకు వీలుగా లోతుగా దర్యాప్తు చేయాలని ఆయన ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా నివారణ చర్యలను చేపట్టాలని సూచించారు. ఇలాంటి విషయాల్లో ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరముందని నొక్కిచెప్పారు. మంటల్లో చిక్కుకున్న వారిలో 17 మంది మృతి చెందడం పట్ల సిఎం తీవ్ర విచారాన్ని, దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. చనిపోయిన వారికి సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున రూ. ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. వారిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీనిచ్చారు. ప్రమాదానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి అగ్నిమాపక శాఖ, పోలీసు అధికారులతో ఎప్పటికప్పుడు ఫోన్‌లో మాట్లాడారని సిఎంఒ ఈ సందర్భంగా తెలిపింది. తద్వారా సహాయక చర్యలను పర్యవేక్షించారని పేర్కొంది. వాటిని వేగవంతం చేయటంతోపాటు బాధితులకు మెరుగైన వైద్య సాయం అందించేందుకు వీలుగా అందుబాటులో ఉన్న మంత్రులు, అధికారులు వెంటనే ఘటన స్థలానికి వెళ్లాలని సిఎం ఆదేశించారు. అక్కడున్న బాధిత కుటుంబ సభ్యులతో ముఖ్యమంత్రి నేరుగా ఫోన్‌లో మాట్లాడారని వివరించింది.



చావులపై రాజకీయమా?

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై చామల ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాదంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పందించిన తీరు అభ్యంతరకరమని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆయన చావులపై రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు భరోసా, మరణించిన వారికి సంతాపం, గాయపడిన వారికి వైద్యం తదితర అంశాలపై మాట్లాడాల్సిన ఆయన... ఈ దుర్ఘటనపై కాంగ్రెస్ ఏమీ చేయడం లేనట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆదివారం ఈ మేరకు ఆయన ఓ వీడియో విడుదల చేశారు. అగ్ని ప్రమాదాలను ఊహించలేమన్నారు. గుజరాత్ రాజ్‌కోట్ అగ్ని ప్రమాదంలో 30 మంది మరణించారనీ, ఉత్తరప్రదేశ్ కాన్పుర్‌లో మరో 25 మంది మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై అక్కడ ఏ రాజకీయ పార్టీ కూడా చిల్లర రాజకీయాలు చేయలేదని గుర్తు చేశారు. పహల్గాంలో ఉగ్రదాడి జరిగితే దేశం మొత్తం ఒకటై నినదించిందని గుర్తు చేశారు. ఊహించి ప్రమాదాలు జరిగినప్పుడు ఏ విధంగా స్పందించాలో తెలిసి కూడా ఆయన ప్రభుత్వంపై విమర్శలు చేశారని గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాదం జరిగిన 15 నిమిషాల్లో రెస్క్యూ బృందాలు రంగంలోకి దిగి 30 మందిని ఆస్పత్రికి తరలించారని తెలిపారు.



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

ప్రభుత్వ వ్యవస్థల నిర్లక్ష్యంతోనే దుర్ఘటన..

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ అధికారులు, వ్యవస్థల నిర్లక్ష్యం తోనే గుల్జార్‌హౌస్‌లో ఎసి షార్ట్ సర్క్యూట్‌తో 17 మంది చనిపోవడం ఆందోళన కలిగిస్తున్నదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. ఆదివారం ఘటనా ప్రాంతాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్, హైదరాబాద్ సౌత్ జిల్లా ప్రతినిధి బృందంతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఫైరింజన్లలో సరిపడా నీళ్లు, ఆక్సిజన్ సిలిండర్లు, మాస్కులు ఉన్న ఫైరింజన్లు, అంబులెన్స్‌లు రాకపోవడంతో ఇంతమంది చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ మాట్లాడుతూ జనసాంద్రత ఎక్కువగా ఉండే ఈ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ అధికారులు సరైన అవగాహన కలిగించకపోవడం ఈ దుర్ఘటనకు కారణమని తెలిపారు. ః సిపిఎం చార్మినార్ జోన్ కార్యదర్శి అబ్దుల్ సత్తార్ మాట్లాడుతూ.. ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా చూడాలన్నారు. ఘటనా స్థలాన్ని సందర్శించిన వారిలో సిపిఎం హైదరాబాద్ సౌత్ జిల్లా నేతలు ఎమ్.మీనా, జి. విఠల్, పి.నాగేశ్వర్, ఎస్ కిషన్, కే జంగయ్య, ఏ కృష్ణ, బాబర్ ఖాన్, రాంకుమార్, యాకూబ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఆదర్శ వివాహం ఎంతో గొప్పది

- సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



మాట్లాడుతున్న బివి రాఘవులు

సమాజంలో వివాహాలు వివిధ రకాలు అని, అందులో స్త్రీ, పురుషులు సమానంగా భావించి కట్న కానుకలు లేకుండా ఆదర్శ వివాహం చేసుకోవడం ఎంతో గొప్ప విషయమని సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లాలో పిఎస్‌ఆర్ కన్వెన్షన్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి నాగయ్య అధ్యక్షతన జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ నాగమణి దంపతుల కుమారుడు ఆకాష్, మహబూబాబాద్‌కు చెందిన బొమ్మ వెంకటేశ్వర్లు రోజా రమణిల కుమార్తె అమృత వర్షిని ఆదర్శ వివాహాన్ని బివి రాఘవులు దగ్గరుండి జరిపించారు. కమ్యూనిస్టు పద్ధతిలో దండలు మార్చుకొని వివాహ ప్రమాణ పత్రాలపై సంతకాలు చేసుకొని ఆదర్శ వివాహం చేసుకున్నారు. ఈ సందర్భంగా బివి రాఘవులు మాట్లాడుతూ వివాహం చేసుకున్న దంపతులు కడసారి వరకు కలిసిమెలిసి ఉండాలని ఆకాంక్షించారు. పురుషులతో సమానంగా అన్ని రంగాలలో మహిళలు రాణిస్తున్నారని అన్నారు. అయితే, సమాజంలో బయటికి రావటంలో మహిళలు కొంత వెనుకబాటులో ఉన్నారని, బయట సమాజంలో 90 శాతం పురుషులు ఉంటే 10 శాతం మాత్రమే మహిళలు కనిపిస్తున్నారని అన్నారు. దేశంలో స్త్రీ పురుషులు ఇద్దరూ ఉత్పత్తిలో భాగస్వామ్యం అయితే దేశ జీడీపి పెరుగుతుందని అన్నారు. సమాజంలో ఉత్పత్తి రంగంలో మహిళల భాగస్వామ్యం పెరగాలని కుటుంబ వ్యవస్థలో పురుషుల పని విధానం పెరగాలని అన్నారు. ఆదర్శ వివాహాలు సమాజంలో సమానత్వాన్ని పెంచుతాయని స్త్రీ పురుషుడు సమానమని భావాన్ని పెంపొందిస్తాయని ఇది దేశ అభ్యున్నతికి ఎంతో అవసరమని అన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపి పోరిక బలరాం నాయక్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్, డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోత్ రామచంద్రనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్‌రావు, సీనియర్ ఐఏఎస్ వెంకటరత్నం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జూలకంటి రంగారెడ్డి, పాలడుగు భాస్కర్, నున్నా నాగేశ్వరరావు, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్, మాజీ ఎమ్మెల్సీ గండు సావిత్రమ్మ, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచంద్రయ్య, సిపిఎం నాయకులు గాదె ప్రభాకర్‌రెడ్డి, జి రాములు, సూడి కృష్ణారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సుర్ణపు సోమయ్య, సిపిఎం పట్టణ నాయకులు, ప్రముఖులు న్యాయవాదులు, వైద్యులు, పారిశ్రామికవేత్తలు, వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

సిఎం రేవంత్‌రెడ్డికి ఖర్గే ఫోన్

- గుల్జార్ హౌస్ ఘటనపై ఆరా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గుల్జార్ హౌస్ ప్రమాదం ఎలా జరిగిందంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఆరా తీశారు. సీఎంకు ఫోన్ చేసి ప్రమాద ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును సీఎం ఆయనకు వివరించారు. ఎప్పటికప్పుడు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. ఘటనాస్థలికి మంత్రులు వెళ్లినట్టు సీఎం వివరించారు.

అత్యంత బాధాకరం: రాహుల్‌గాంధీ

హైదరాబాద్ అగ్ని ప్రమాద ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ స్పందించారు. ప్రమాదంలో ఎనిమిది మంది పిల్లలతోసహా 17 మంది చనిపోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

సంతాపం : గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాదంలో మరణించిన వారికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తీవ్ర సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారి వైద్యానికి కావాల్సిన సహాయం అందించాలని ప్రభుత్వానికి సూచించారు.

దిగ్భ్రాంతికరం : సిఎం రేవంత్‌రెడ్డి

పాత బస్తీ గుల్జార్ హౌస్ సమీపంలో జరిగిన అగ్ని ప్రమాదంపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గుల్జార్ హౌస్ ప్రమాదంలో మరణించిన వారికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు, పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విచారకరం : ప్రతి పక్ష నేత కెసిఆర్

పాతబస్తీలోని చార్మినార్ సమీపంలోగల గుల్జార్ హౌస్‌లో జరిగిన ఘోర అగ్నిప్రమాదంపై బిఆర్‌ఎస్ అధ్యక్షులు, ప్రతిపక్ష నేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆ మరణాల పట్ల విచారం వ్యక్తం చేశారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తదితరులు సంతాపం ప్రకటించారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పివి శివకుమార్ మృతి పట్ల సిఎం సంతాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



సీనియర్ ఫొటో జర్నలిస్టు పివి శివ కుమార్ (66) అకాల మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం సంతాపం వ్యక్తం చేశారు. ఆయన 'ది హిందూ' పత్రికలో సీనియర్ స్పెషల్ న్యూస్ ఫొటో గ్రాఫర్‌గా పని చేసి రిటైరయ్యారని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన శివకుమార్ ఫొటో జర్నలిస్టుగా తన కెరీర్‌లో ఉత్తమ అవార్డులు అందుకోవడంతోపాటు పత్రికా రంగానికి విశేష సేవలందించారని ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి పట్ల సమాచార సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. శివకుమార్ కుటుంబానికి సానుభూతి తెలిపారు.

ఫొటో జర్నలిస్టుల సంతాపం

సీనియర్ ఫొటో జర్నలిస్టు పోచెంచర్ల వెంకట శివకుమార్ (పివి శివకుమార్) ఆకస్మిక మృతి బాధాకరమని తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అనుమల్ల గంగాధర్, కె.ఎన్.హరి, కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. పివి శివకుమార్ ఇండియన్ ఎక్స్ ప్రెస్ (1985-1993), ది హిందూ దిన పత్రిక (1993-2015) ల్లో పని చేశారని తెలిపారు. సమర్థవంతమైన ఫోటోగ్రాఫర్లలో ఒకరైన ఆయన తన కెమెరాతో అద్భుత చిత్రాలను తీశారని గుర్తు చేశారు. 1990ల్లో హైదరాబాద్ కర్ఫ్యూ సమయంలో తీసిన ఫోటోలతోపాటు 1996 అక్టోబర్‌లో ప్రకాశం జిల్లాలో తుఫాను సమయంలో, మోపాడు జలాశయం కట్ట తెగిపోవడంతో ధ్వంసమైన ప్రకాశం జిల్లాలోని కొత్తపల్లి గ్రామంలో నడుము లోతు నీళ్లలో నడుచుకుంటూ తీసిన ఫోటోలు, మావోయిస్టు రామకృష్ణ ఇంటర్వ్యూలు, అనేక రాజకీయ సంఘటనల ఫోటోలు ఆయనకు పేరు తెచ్చి పెట్టాయని పేర్కొన్నారు. 2015లో హిందూ పత్రిక నుంచి రిటైర్మెంట్ తర్వాత శివకుమార్ ఔత్సాహిక ఫోటో గ్రాఫర్స్‌కు ఫోటోగ్రఫీలో మెళకువలు నేర్పారని తెలిపారు.

రఘుపాల్ జీవితం ఆదర్శనీయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



సిపిఎం నేత రఘుపాల్ జీవితం కమ్యూనిస్టు ఉద్యమకారులకు ఆదర్శనీయం. రఘుపాల్ 22 మే 1942లో జన్మించారు. ఆయనకు భార్య భారతి, కుమారుడు డాక్టర్ గోపాల్‌రెడ్డి, కోడలు డాక్టర్ విజయలక్ష్మి, కూతురు ఉన్నారు. సిపిఎం నగర మాజీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ ఆయన అల్లుడు. రఘుపాల్ తండ్రి జి.గోపాల్‌రెడ్డి 1957లో పిడిఎఫ్ నుంచి జనగామ ఎమ్మెల్యేగా గెలుపొందారు. తండ్రి అజ్ఞాతజీవితం గడిపే సమయంలో పుచ్చలపల్లి సుందరయ్య, లీలమ్మ ఆదర్శ దంపతుల చేతుల్లో ఆయన బాల్యం గడిచింది. ఉన్నత విద్యను అభ్యసించారు. పశువైద్యులుగా ఉద్యోగం వచ్చినా పార్టీలో పనిచేసేందుకే మొగ్గుచూపారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ చీలిక సమయంలో తండ్రి సిపిఐ పక్షాన ఉంటే రఘుపాల్ సిపిఎం వైపు వచ్చారు. 1985 నుంచి 15 ఏండ్లపాటు సిపిఎం హైదరాబాద్ నగర కార్యదర్శిగా పని చేశారు. భాస్కర్‌రావు, డీజీ నర్సింహారావు, ఎమ్.ఎన్.రెడ్డి, లక్ష్మీదాస్, కృపేందర్, వెంకటేశ్, తదితరులతో కలిసి పార్టీ విస్తరణకు కృషి చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా సేవలందించారు. హైదరాబాద్‌లో కార్మికోద్యమ నిర్మాణంలో ఆయనది కీలక పాత్ర. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పని చేశారు. ప్రభుత్వ రంగంలో ట్రేడ్‌యూనియన్ విస్తరణకు కృషి చేశారు. ప్రతీ పార్లమెంటు, అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో నెలల తరబడి జనగామను కేంద్రంగా చేసుకొని అన్ని గ్రామాలు తిరుగుతూ సిపిఎం అభ్యర్థుల గెలుపు కోసం శ్రమించేవారు. రఘుపాల్ జీవితం కమ్యూనిస్టు ఉద్యమకారులకు ఆదర్శనీయం. 15 ఏండ్లుగా అఖిలభారత శాంతి సంఘీభావ సంఘంలో కీలకంగా పని చేశారు. ప్రస్తుతం ఆ సంఘంలో జాతీయ సలహా మండలి సభ్యులుగా కొనసాగుతున్నారు. గతంలో ఆ సంఘానికి ఉపాధ్యక్షులుగా, కార్యదర్శిగా సేవలందించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం అభివృద్ధిలోనూ తన వంతు పాత్ర పోషించారు. 2000 సంవత్సరంలో వచ్చిన వరదలతో ఎస్వీకే లైబ్రరీ పూర్తిగా నిండిపోయి పుస్తకాలు ఆగమయ్యాయి. ఎస్‌వికె లైబ్రరీని పునరుద్ధరించడంలో తనవంతు సహకారం అందించారు. సాయుధపోరాటంలో పాల్గొన్న వారిపై అధ్యయనం చేసి పుస్తకాలు రాయించడంలో సహకరించారు.

సిపిఎం హైదరాబాద్ నగర మాజీ కార్యదర్శి, సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ సభ్యులు జి రఘుపాల్ మరణం పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, ఎస్‌వికె కార్యదర్శి ఎస్ వినయకుమార్ తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. ప్రజల కోసం తమ జీవితాలను అర్పించిన మలితరం నాయకుల్లో ఆయన ఒకరని వారు తెలిపారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రఘుపాల్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రఘుపాల్ మృతి పట్ల నవతెలంగాణ సిజిఎం ప్రభాకర్, ఎడిటర్ ఆర్ సుధాభాస్కర్ సంతాపాన్ని ప్రకటించారు. ఆయన కొంత కాలం ప్రజాశక్తి పత్రికలో పనిచేశారనీ, అంతర్జాతీయ వార్తలతోపాటు పలు అంశాలపై వ్యాసాలు రాసేవారని గుర్తు చేశారు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని తెలిపారు. రఘుపాల్ మృతికి సంతాపాన్ని తెలియజేస్తూ ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించారు.



ఎత్తిపోతల పథకం పురోగతి పనులను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్

పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణం వేగవంతం

- త్వరలో తుమ్మిడి హట్టి పనులు ప్రారంభం
- ఆధునిక పరిజ్ఞానంతో ఎస్‌ఎల్‌బిసి పునఃప్రారంభం
- రూ.270 కోట్లతో జానపహాడ్ ఎత్తిపోతల పథకం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం రూట్ మ్యాప్ రూపొందించుకుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖా మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఎ, బి కేటగిరీలుగా విభజించి పనులను వేగవంతం చేస్తున్నామన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నిరందించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం టైంబౌండ్ ప్రోగ్రాం పెట్టుకుని ముందుకు పోతుందని ఆయన పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం హుజుర్నగర్ నియోజకవర్గ పరిధిలోని పాలకీడు మండలం జానపహాడ్‌లో రూ.270 కోట్లతో నిర్మిస్తున్న జానపహాడ్ ఎత్తిపోతల పథకం, రూ.33.83 కోట్లతో నిర్మిస్తున్న బెట్టే తండా ఎత్తిపోతల పథకం పురోగతి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 14న జలసౌధలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో పెండింగ్ ప్రాజెక్టుల పురోగతి పై పూర్తి స్థాయిలో సమీక్షా నిర్వహించామన్నారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయలసాగర్, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల నిర్మణాలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అదే విధంగా నల్లగొండ జిల్లాకు చెందిన డిండి, ఉదయ సముద్రం ప్రాజెక్టుల తోపాటు, ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టు, ఉత్తర తెలంగాణాకు చెందిన దేవాదుల, గౌరవెల్లి ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తుమ్మిడి హట్టి పనులను త్వరలో ప్రారంభించడంతో పాటు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎస్‌ఎల్‌బిసి పనులను పున్ణప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. హుజుర్నగర్ నియోజకవర్గ పరిధిలోని పాలకీడు మండలంలోని జానపహాడ్ ఎత్తిపోతల పథకం,బెట్టే తండా ఎత్తిపోతల పథకాలను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు



కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన మిస్ వరల్డ్ పోటీదారులు

డ్రగ్స్ నివారణకు మా మద్దతు

- కమాండ్ కంట్రోల్ సెంటర్ సందర్శించిన మిస్ వరల్డ్ పోటీదారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డ్రగ్స్ నివారణ కోసం తెలంగాణ పోలీస్ చేపట్టిన చర్యలకు తమ సంపూర్ణ మద్దతు అని 107 దేశాల మిస్ వరల్డ్ పోటీదారులు ప్రకటించారు. ఈ మేరకు మత్తు మందు నివారణ పోస్టర్లపై సంతకాలు, మెస్సేజ్‌లు రాశారు. ఆదివారం వారు హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని సందర్శించారు. సిసిసికి చేరుకున్న వారికి పోలీసు అశ్విక దళం, పైపు బ్యాండ్, మోటర్ సైకిల్ రైడర్స్, స్నిప్పర్ డాగ్ స్క్వాడ్‌లతో పోలీస్ శాఖ స్వాగతం పలికింది. పోలీసు శాఖ అమలు చేస్తున్న పలు విధానాలు, అవి పనిచేసే విధానంపై ప్రజంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న పటిష్టమైన విధానాలతో రాష్ట్రంలో 17 శాతం నేరాలు తగ్గాయనీ, వివిధ అంశాల్లో తెలంగాణా పోలీసులకు అంతర్జాతీయ అవార్డులు కూడా లభించాయని వివరించారు. దేశంలో మరెక్కడా లేని విధంగా ట్రాన్స్ జెండర్ల సేవలను ట్రాఫిక్ విభాగంలో ఉపయోగించుకుంటున్నామని తెలిపారు. మొత్తం ప్రపంచానికే సవాలుగా మారిన సైబర్ నేరాల నియంత్రణలో అత్యంత ఆధునిక టెక్నాలజీని వాడుతున్నామనీ, లక్షల సంఖ్యలో ఏర్పాటు చేసిన సీసీటీవీలతో, రాష్ట్రంలో ఎక్కడ నేరం జరిగినా వెంటనే తగు చర్యలను చేపడుతున్నామని చెప్పారు. ముఖ్యంగా సేఫ్టీ టూరిజంలో తెలంగాణా అత్యంత సురక్షితమైనదనీ, ఇందుకు తెలంగాణా పోలీస్ చేపట్టిన పటిష్టమైన చర్యలే కారణమని వివరించారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలో శాంతి భద్రతల రక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న పలు విధానాలను వారు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తెలంగాణా పండగలు, సంస్కృతీ, సంప్రదాయాలను కళ్ళ ముందించేలా శాస్త్రీయ నృత్య ప్రదర్శనను తిలకించారు. ఈ పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన పోలీసు ఆయుధాల ప్రదర్శన, ఆక్టోపస్, గ్రే హౌండ్స్, పోలీస్ జాగిలాల ప్రదర్శనలు, పైప్ బ్యాండ్, అశ్విక దళంలను కాంటెస్టర్లు ఆసక్తిగా పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ గదిలో ఏర్పాటు చేసిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, సర్వేలెన్స్ ఫీడ్‌లు, తక్షణమే స్పందించే వ్యవస్థను మిస్ వరల్డ్ పోటీదారులు పరిశీలించారు.

ఒకేసారి ఎన్నికలతో ఖర్చు, సమయం ఆదా

కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశంలో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహిస్తే భారీ ఎత్తున ఖర్చు ఆదా అవుతుందనీ, ప్రజలకు సేవచేసే సమయం కూడా ఎక్కువ అందుబాటులో ఉంటుందని కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని హోటల్ కత్రియాలో ఒకే దేశం.. ఒకే ఎన్నిక అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ ద్వారా ఆయన మాట్లాడారు.. ఒకే దేశం.. ఒకే ఎన్నిక... ఒకే వ్యవసాయ విధానం.. ఒకే టీమ్ తమ సంకల్పమన్నారు. సంవత్సరం పొడుగుతా ఎన్నికలుంటే అభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. దేశంలో ప్రతి నాలుగు, ఆరు నెలలకు ఒక సారి ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్నాయని చెప్పారు. ఇలా జరగడం దేశానికి నష్టదాయకమన్నారు. ఎక్కడైతే ఎన్నిక జరుగుద్దో కేవలం అక్కడ మాత్రమే అధికారులు పనిచేయరనీ, వేరే రాష్ట్రాల నుంచీ రావాలని అన్నారు. పోలీసులు, డాక్టర్లు, అంగన్‌వాడీలు, ఆశాలు, టీచర్లు ఎప్పుడూ ఎన్నికల విధుల్లోనే ఉంటే వారి విధులు ఎప్పుడు చేయాలని అడిగారు. 1951 పార్లమెంట్ ఎన్నికల్లో రూ.11 వేల కోట్లు ఖర్చయితే...2024కు వచ్చేసరికి అది రూ.1.35 లక్షల కోట్లు ఖర్చయిందని వివరించారు. రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలకు మళ్లీ డబ్బు ఖర్చుపెట్టాల్సి వస్తోందన్నారు. ఆ రెండింటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహించే ఖర్చు కలిసి వస్తుందని తెలిపారు. వన్ నేషన్.. వన్ ఎలక్షన్ తమ విధానమని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..వర్తమాన రాజకీయ ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా చట్టాల్ని మార్చుకోవాలని ప్రధాని మోడీ చెబుతుంటే కొందరు దానికి అడ్డుపడుతున్నారని చెప్పారు. రాజకీయ నేతులు, మేధావులు, విశ్లేషకులపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు వన్ నేషన్..వన్ ఎలక్షన్‌ను ప్రజా ఉద్యమంగా మలుస్తామని చెప్పారు. దేశంలో సంస్కరణలు తీసుకురావడం తమ ప్రభుత్వానికే సాధ్యమన్నారు. వేర్వేరు రాష్ట్రాల్లో వేరు సందర్భాల్లో ఎన్నికలు జరగడం దేశాభివృద్ధికి ఆటంకంగా మారిందని చెప్పారు.

ప్రయివేటు ప్రీ ప్రైమరీ అధ్యాపకులకు ఆన్‌లైన్ శిక్షణ

హైదరాబాద్ బ్యూరో : తెలంగాణ రాష్ట్రంలోని ప్రయివేటు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు కేంద్ర ప్రభుత్వ నైపుణ్య శిక్షణా కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆన్‌లైన్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని ప్రయివేటు పాఠశాలలు, పిల్లల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ షమాయేల్ అహ్మద్, మెర్విన్ కోవెల్ తెలిపారు. దీనికి సంబంధించిన ఆన్‌లైన్ పోర్టల్‌ను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. కొత్త విద్యా విధానం ప్రకారం, పిల్లలకు మెరుగైన విద్యను అందించేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని వివరించారు. ఆన్‌లైన్ శిక్షణ 30 గంటలు ఉంటుందనీ, రూ.8 వేలు ఫీజు చెల్లించాలని తెలిపారు. ఇతర వివరాల కోసం ఫోన్ నెంబర్లు 9835092109, 011 41003505 సంప్రదించాలని కోరారు.

కలిసి పని చేద్దాం

- రష్యా కాన్సుల్ జనరల్ వాలెరి ఖోడ్జాయేవ్‌తో ఉపముఖ్యమంత్రి భట్టి

హైదరాబాద్ బ్యూరో : అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి.. కలిసి పని చేద్దామని రష్యా కాన్సుల్ జనరల్ వాలెరి ఖోడ్జాయేవ్‌ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. ఆదివారం సాయంత్రం ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను రష్యా కాన్సుల్ జనరల్ వాలెరి ఖోడ్జాయేవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న అభివద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రష్యా కాన్సుల్ జనరల్ వాలెరి ఖోడ్జాయేవ్‌కు వివరించారు. దేశంలో తెలంగాణ కొత్త రాష్ట్రం అయినప్పటికీ అభివృద్ధిలో దూసుకెళ్తుందని చెప్పారు. హైదరాబాద్ నగరంలో 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేస్తున్నామని, రాష్ట్రంలో ఫార్మా ఇండస్ట్రీతోపాటు ఇతర పరిశ్రమల అభివృద్ధికి అదే విధంగా హార్డ్వేర్, సాఫ్ట్వేర్ విస్తరణకు కావలసిన సహకారాన్ని ప్రభుత్వం అందించి ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. టెక్స్‌టైల్, కోల్ ఇండస్ట్రీ బయోటెక్నాలజీ, టి హబ్, ఐటి ఇండస్ట్రీ అభివృద్ధి గురించి వివరించారు. రాష్ట్రంలో అద్భుతమైన మానవ వనరులను తీర్చిదిద్దిన ప్రొఫెషనల్, ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అద్భుతమైన నైపుణ్యం కలిగిన మానవ వనరుల అభివృద్ధి చేయడానికి ప్రజా ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. పెట్టుబడులు పెట్టడానికి అన్ని రకాలుగా తెలంగాణ రాష్ట్రం అనువుగా ఉంటుందని వివరించారు. భారత్- రష్యా దేశాల మధ్య మంచి సత్సంబంధాలు కొనసాగుతున్నాయని, భవిష్యత్తులో కూడా ఇదే విధమైన సత్సంబంధాలు కొనసాగించడానికి కావలసిన అన్ని రకాల సహకారాలు, సదుపాయాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా వాలేరి ఖోడ్జాయేవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి వచ్చినందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు.

జనసంద్రంగా కాళేశ్వరం

- సరస్వతీ పుష్కరాలకు పోటెత్తిన యాత్రికులు
- హెలికాప్టర్ ద్వారా కలెక్టర్ ఏరియల్ సర్వే



హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే చేస్తున్న జిల్లా కలెక్టర్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పుష్కరాల వేల జయశంకర్-భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం పుణ్యక్షేత్రం జనసంద్రంగా మారింది. ఆదివారం సెలవుదినం కావడంతో యాత్రికులు పోటెత్తారు. సరస్వతి పుష్కరాల్లో భాగంగా 4వ రోజు ఆదివారం లక్షలాది మంది యాత్రికులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. శనివారం ట్రాఫిక్ జామ్ కావడంతో ఎదురైన ఇబ్బందులు పునరావతం కాకుండా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాల మేరకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా వాహనాల రాకపోకలు సాగాయి.

కాళేశ్వరంలో ప్రజల రద్దీ కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు. నది తీరం, వాహనాలు రాకపోకలతో పాటు ఏర్పాట్లు తదితర సేవలను పర్యవేక్షించారు. ఉదయం నుండి కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. సరస్వతి ఘాట్, త్రివేణి సంగమం, ఆరోగ్య శిబిరం, కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవాలయం, పుష్కర విధులు నిర్వహించు సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజనశాల తదితర ప్రాంతాలల్లో పర్యటించారు. రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతున్నదని, సోమవారం వరకు అదనంగా చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని పిఆర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. భక్తులు వెళ్లేందుకు వీలుగా అదనంగా తాత్కాలిక రహదారి వేయాలని తెలిపారు. వ్యర్థాలు వేసేందుకు అదనంగా డస్ట్ బిన్స్ ఏర్పాటు చేయాలని డిపిఓను ఆదేశించారు.

సంగమ ప్రాంతంలో అపరిశుభ్రత లేకుండా ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించి పరిశుభ్రం చేయాలని స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్, డిపిఓకు సూచించారు. యాత్రికులకు దర్శనం త్వరగా అయ్యేలా చూడాలని దేవస్థానం సిబ్బందిని కోరారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. భద్రత, శుభ్రత, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

ప్రజలకు అనువుగా జాయ్ రైడ్ : జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ

యాత్రికులు కాళేశ్వరం అందాలను వీక్షించేందుకు అనువుగా జాయ్ రైడ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఆదివారం ఉదయం హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు. అనంతరం సరస్వతి ఘాట్ ప్రాంతాలను పరిశీలించారు. సరస్వతీ పుష్కరాలకు వచ్చే సందర్శకులకు హెలికాప్టర్ ద్వారా త్రివేణి సంగమం, కాళేశ్వర దేవస్థానం, కాళేశ్వరం చుట్టు ప్రక్కల అడవులు తదితర అందాలను వీక్షించడానికి జాయ్ రైడ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట కరీంనగర్ సిపి గౌస్ అలం, కరీంనగర్ స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఉన్నారు.

ఇందిర సౌర గిరి జల వికాసానికి రూ.12,600 కోట్లు

- నేడు అచ్చంపేటలో ప్రారంభించనున్న సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యూపీఏ ప్రభుత్వం 2006లో తీసుకొచ్చిన ఆర్ఓఎఫ్ఆర్ చట్టం ప్రకారం రాష్ట్రంలో హక్కు పత్రాలు పొందిన గిరిజన రైతుల ఆర్థిక, జీవన ప్రమాణాలు పెంచడానికి ప్రజా ప్రభుత్వం ఇందిరా సౌర గిరి జల వికాసం పథకాన్ని రూపకల్పన చేసింది. ఈ పథకానికి సంబంధించి గురువారం గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ ఏ శరత్ జీవో విడుదల చేశారు. 2006 సంవత్సరంలో వచ్చిన ఈ చట్టం ప్రకారం రాష్ట్రంలో ఆర్ఓఎఫ్ఆర్ హక్కు పత్రాలు పొంది ఉన్న 2.10 లక్షల మంది రైతులకు ఐదేండ్లలో ఆరు లక్షల ఎకరాలకు సౌర విద్యుత్ ద్వారా సాగునీరు అందించేందుకు రూపకల్పన చేసిన ఈ పథకానికి రూ.12,600 కోట్ల కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఈ పథకాన్ని నేడు అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించనున్నారు. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ ఏర్పాట్లను ఆర్థిక ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా పర్యవేక్షిస్తున్నారు.

నిజాం కాలం నాటి నక్షాలకు మోక్షం

- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో నిజాం కాలం నుంచి ఉన్న నక్షాలకు మోక్షం కల్పించబోతున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో సర్వే రికార్డులు లేని గ్రామాలు 413 ఉన్నాయని తెలిపారు. ఐదు గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా సర్వే చేపట్టనున్నట్టు తెలిపారు. అక్కడి నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ అధారంగా మిగతా గ్రామాల్లో అమలు చేస్తామని వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్ నగర్, జగిత్యాల్ జిల్లా భీర్‌పూర్ మండలం కొమ్మనాపల్లి (కొత్తది), ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ, ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురు, సంగారెడ్డి జిల్లా వట్ పల్లి మండలం షాహిద్ నగర్ గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు.

నేడు పుచ్చలపల్లి సుందరయ్య స్మారకోపన్యాసం

- 40వ వర్ధంతి సందర్భంగా నిర్వహణ
- 'భగత్‌సింగ్ ప్రాసంగికత-నేటి రాజకీయాలు' పై ప్రొఫెసర్ చమన్‌లాల్ ప్రసంగం
- వివరాలు వెల్లడించిన ఎస్‌వికె కార్యదర్శి వినయకుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్వాతంత్ర్య సమరయోధుడు, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, తెలంగాణ సాయుధ పోరాట ముఖ్య నాయకుల్లో ఒకరైన పుచ్చలపల్లి సుందరయ్య. 40వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో "భగత్‌సింగ్ ప్రాసంగికత-నేటి రాజకీయాలు" అనే అంశంపై సోమవారం స్మాకోపాన్యాసాన్ని నిర్వహిస్తున్నట్టు ఎస్‌వికె కార్యదర్శి ఎస్ వినయకుమార్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎస్వీకేలో ఆయన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుందరయ్య పోరాట స్ఫూర్తితో విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రంలో అనేక ఉద్యమాలు నిర్మించారనీ, ఆ ఉద్యమాల వల్ల పేదలు, రైతులకు ప్రయోజనం కలిగిందని చెప్పారు. ఆయన మరణించిన రెండేండ్లకే హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో సుందరయ్య విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. అనంతరం గచ్చిబౌలిలోని విశాల ప్రాంగణంలో ఆయన పేర మరో విజ్ఞాన కేంద్రం ప్రారంభమైందన్నారు. తెలుగు, ఇంగ్లీషు ఉర్దూ భాషల్లో దాదాపు నాలుగు లక్షల పుస్తకాలు, మాగజైన్లు అరుదైన రాత పత్రులు గచ్చిబౌలి గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఉచిత వైద్యశిబిరాల వంటి సేవా కార్యక్రమాలు కూడా అక్కడ నిర్వహిస్తున్నామని తెలిపారు. మరోవైపు బాగ్‌లింగంపల్లిలోని ఎస్వీకే నిరంతరం వివిధ రాజకీయ, సామాజిక, సభలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలకు కేంద్రంగా మారిందని గుర్తు చేశారు. సివిల్స్, వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతీ యువకులకోసం ఉచిత స్టడీ హాల్‌ను కేటాయించినట్టు చెప్పారు. భవన ప్రాంగణంలో కంప్యూటర్ కోర్సులు నేర్పించే నియోకర్సర్ సెంటర్ నడుస్తోందన్నారు. మహిళలకు కుట్టుశిక్షణా , జూట్ శిక్షణా కేంద్రం, బ్యూటీషన్ శిక్షణ, కూచిపూడి నృత్యం, శాస్త్రీయ సంగీతం (వోకల్)లో శిక్షణలు ఇస్తున్నట్టు తెలిపారు. ఎస్వీకే ప్రాంగణంలోనే క్లినిక్ నడుస్తోందనీ, పిల్లల స్పెషలిస్టు, ప్యామిలి ఫిజిషియన్, డయబెటాలజిస్టు అందుబాటులో ఉంటున్నారని చెప్పారు.అక్యుపంచర్ క్లినిక్, ఫిజియోథెరపితో పాటు తక్కువరేట్లపై రక్త, మల, మూత్ర పరీక్షలు నిర్వహించే లాబోరేటరీ ఉందన్నారు. తరచూ వివిధ వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ సేవా కార్యక్రమాలన్నీ సుందరయ్య ఆచరించిన సేవా కార్యక్రమాల స్ఫూర్తితో నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజలకు తక్కువ ఖర్చుతో వైద్యం అందించడానికి జనరిక్ మందులను అందుబాటులోకి తెచ్చామనీ, ఇక్కడితోనే ఆగకుండా రాష్ట్రంలో పది జనరిక్ షాపులను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వాటికి ఉత్తమ లఘుచిత్రాలను ప్రోత్స హించే లక్ష్యంతో దాశరథి ఫిల్మ్ సొసైటీని ఏర్పాటు చేసి, నెలలో రెండు సార్లు లఘుచిత్రాలను ప్రదర్శిస్తున్నట్టు చెప్పారు. ప్రతి ఏటా సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఒక ప్రముఖుడి చేత ముఖ్యమైన అంశంపై స్మారకోపన్యాసాన్ని ఇప్పిస్తున్నామని వినయకుమార్ తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం ఐదున్నరకు "నేటి రాజకీయాలు భగత్ సింగ్ ప్రాసంగికత" అనే అంశంపై ఢిల్లీలోని జవహార్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ, పంజాబ్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ గా పని చేసిన ప్రొఫెసర్ చమన్‌లాల్‌తో స్మారకోపాన్యాసాన్ని ఇప్పిస్తున్నామని వెల్లడించారు. ఈ సభకు ఎస్వీకె ట్రస్టు అధ్యక్షుడు బి.వి. రాఘవులు అధ్యక్షత వహిస్తారనీ, కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడతారని తెలిపారు. విలేకర్ల సమావేశంలో భూపతి వెంకటేశ్వర్లు, రమణారావు పాల్గొన్నారు.

చలం సాహిత్యంపై విస్తృత ప్రచారం అవసరం

ప్రజాశక్తి కల్చరల్

స్త్రీ పురుషుల అసమానతల పై నాటి సమాజం లో దురాచారలపై తీవ్రం గా ప్రశ్నించిన చలం సాహిత్యం నేటికి విస్తృతం ప్రచారం లేక పోవటం బాధాకరం అని రాష్ట్ర సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ నందిని సిద్ద రెడ్డి అన్నారు రవీంద్ర భారతి లోని సమావేశ మందిరంలో చలం భావన సంస్థ నిర్వహణ లో జీవ జలం చలం సాహిత్య స్మారక ప్రసంగ సదస్సు జరిగింది నందిని సిద్ద రెడ్డి మాట్లాడుతూ చలం సాహిత్యం పై పరిశోధన చేసి డాక్టరేట్ పొందిన నాలేస్వరం శంకరం ఎన్నో ఏళ్ళు గా చలం సాహిత్య ప్రచారానికి కృషి చేస్తున్నారు అని అభినందించారు సమకాలిక సాహిత్యకారులకు లభించిన ప్రచారం చలం కు దక్కలేదు అన్నారు చలం రచన స్త్రీ సంపుటి పై నెల్లుట్ల రమా దేవి మాట్లాడుతూ నాటి కట్టుబాట్లు సంప్రదాయ ఆచార వ్యవహారాలు వల్ల స్త్రీ కి స్వేచ్ఛ లేదని తెలుపుతూ చలం సామాజిక సంస్కరణ ఉద్యమం స్త్రీ రచనలతో ఆరంభించారు అని వివరించారు ఆయన సాహిత్యం సర్వకాలీ యం అని చెప్పారు ప్రేమలేఖలు లో మల్లేశ్వరి మాట్లాడుతూ చలం షరతులు లేని ప్రేమ ను ప్రతిపాదించారు అని వివరించారు డాక్టర్ శంకరం మాట్లాడుతూ తెలుగు అక్షరం పై అచంచల ప్రభావం వేసిన వారు చలం అన్నారు.స్త్రీ కి శరీరం ఉంది దానికి వ్యాయామం కావాలి,ఆమెకు మెదడు ఉంది జ్ఞానం ఇవ్వాలి హృదయం ఉంది దానికి అనుభవం ఇవ్వాలి అని ప్రతిపాడించిన చలం స్త్రీ పురుష సంబంధాలు పునాది నీ ప్రశ్నించే రచనలు చేసారు అని వివరించారు జర్నలిస్టు లు సలీమ, నస్రీన్ ఖాన్ అనురాధ భాష్యం పద్మావతి తదితరులు స్త్రీ, ప్రేమ లేఖలు సంపుటి లోని కొన్ని భాగాలు చదివారు



గజల్స్‌లో భావ వ్యక్తీకరణ గుండె తడి చేస్తుంది

- ప్రఖ్యాత కవి ఆచార్య కొలకలూరి ఇనాక్

ప్రజాశక్తి కల్చరల్

జ్యోతిర్మయి రచించిన చూపు ఎంత అలసిందో లో ప్రతి గజల్ నందలి భావ వ్యక్తీకరణ గుండె తడిచేస్తుంది అని ప్రఖ్యాత కవి శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు రవీంద్ర భారతి లోని సమావేశ మందిరంలో ప్రముఖ గజల్స్ గాయని మళ్ళ జ్యోతిర్మయి రచించిన చూపు ఎంత అలసిందో గజల్స్ సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది ముఖ్య అతిథిగా ఆచార్య ఇనాక్ పాల్గొని సంపుటి ఆవిష్కరించి మాట్లాడారు జ్యోతిర్మయి గజల్ రాయటం స్వర కూర్పు చేసుకుని తానే గానం చేయటం తో భావ తీవ్రత ప్రస్ఫుటం గా ధ్వనిస్తుంది అని అభినందించారు విఖ్యాత కవులు దాశరథి సినారె ల గజల్స్ ప్రయోగం జ్యోతిర్మయి కొనసాగిస్తున్నారు అని అన్నారు గజల్ సహజం గా ఆర్తి ప్రధానమే ఉంటుందని జ్యోతిర్మయి స్వరం లో అది వినిపిస్తుంది అందుకే ఆమె గానం శ్రావ్యం అని పేర్కొన్నారు అధ్యక్షత వహించిన పత్రికా రచయిత కవి వాహెద్ మాట్లాడుతూ తాత్విక భావన సామాజిక చింతన చూపు ఎంత అలసిందో గజల్స్ లో ధ్యోతక మవుతోంది అన్నారు తెలుగు గజల్స్ ప్రాచుర్యం కోసం ప్రత్యేకించి అకాడమీ స్థాపించిన జ్యోతిర్మయి కి ఎందరో అభిమానులు ఉన్నారని చెప్పారు కవి బిక్కు కృష్ణ సంపుటిని సమీక్ష చేశారు సినీ నటుడు దేవీ ప్రసాద్ నాటక రచయిత డి విజయ భాస్కర్,విజయ లక్ష్మి పండిట్ స్వరూప రాణి చిత్రకారుడు కూచి తదితరులు పాల్గొన్నారు

ఫాల్కన్ కుంభకోణం...

- మరో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫాల్కన్ కుంభకోణం కేసులో తెలంగాణ సిఐడి అధికారులు ఆదదివారం మరో ఇద్దర్ని అరెస్టు చేశారు. రబీంద్ర ప్రసాద్, సుష్మారాజ్ అనే ఇద్దరిని బిహార్‌లో అరెస్టు చేసి.. పీటీ వారెంట్‌పై వారిని హైదరాబాద్ తీసుకొచ్చారు. ఇద్దరు నిందితుల్నీ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచిన అనంతరం రిమాండ్‌కు తరలించారు. తాజాగా అరెస్టయిన ఇద్దరు నిందితులూ.. ఈ కేసులో ఏ2గా ఉన్న అమర్‌దీప్ కుటుంబ సభ్యులు. వీరిద్దరూ ఫాల్కన్ కుంభకోణంలో చురుగ్గా వ్యవహరించి.. అక్రమార్జన చేసినట్లు సిఐడి గుర్తించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న యోగేంద్రసింగ్‌ను సీఐడీ ఇప్పటికే అరెస్టు చేసింది. మరోవైపు ఫాల్కన్ వైస్ ప్రెసిడెంట్ పవన్‌కుమార్ ఓదెల, డైరెక్టర్ కావ్య నల్లూరి ఇప్పటికే రిమాండ్‌లో ఉన్నారు. అధిక లాభాలు ఆశ చూపి 7056 మంది నుంచి సుమారు రూ.4,215 కోట్లు వసూలు చేసినట్లు ఫాల్కన్ సంస్థపై ఆరోపణలు ఉన్నాయి. 4,065 మంది బాధితులకు రూ.792 కోట్లు చెల్లించకుండా మోసం చేసినట్లు అధికారులు గుర్తించారు.

పిన్నీసు మింగి చిన్నారి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆట వస్తువులోని పిన్నీసు మింగడంతో ఓ చిన్నారి మృతి చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలోని నాచారం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హర్యానాకు చెందిన షోయబ్ ఖాన్ నాచారంలో జెసిబి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. 14 నెలల వయసు గల షోయబ్‌ఖాన్ కుమార్తె ఆటవస్తువులోని పిన్నీసు మింగింది. వెంటనే పాపను ఆర్వీయం ఆస్పత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిలోఫర్ హాస్పిటల్‌కి తరలించారు. నిలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. చిన్నారి తండ్రి షోయబ్ ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు గౌరారం ప్రొబేషనరీ ఎస్సై కీర్తి రాజు తెలిపారు.

చర్లపల్లి ఐఒసి వద్ద పెట్రోల్ ట్యాంకర్‌లో మంటలు

- ఫైర్ సిబ్బంది సమయస్ఫూర్తితో తప్పిన పెను ప్రమాదం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చర్లపల్లిలోని ఐఒసి పెట్రోలియం వద్ద ఆదివారం ఖాళీ పెట్రోల్ ట్యాంకర్ వెళ్తుండగా మంటలు చెలరేగి పక్కన ఉన్న ఫుల్ ట్యాంక్ పెట్రోల్, మరో గ్యాస్ ట్యాంకర్లకు మంటలు వ్యాపించాయి. వెంటనే ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. వివరాల్లోకి వెళితే.. ఆదివారం చర్లపల్లిలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఒసి) వద్ద అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఖాళీగా వెళ్తున్న పెట్రోల్ ట్యాంకర్‌కు అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తమై ట్యాంకర్‌ను పక్కకు ఆపినప్పటికీ, మంటలు సమీపంలో నిలిపి ఉన్న ఓ ఫుల్ ట్యాంక్ పెట్రోల్ ట్యాంకర్, మరో గ్యాస్ ట్యాంకర్‌కు వ్యాపించాయి. వెంటనే సమాచారం అందుకున్న చర్లపల్లి అగ్నిమాపక స్టేషన్ ఫైర్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. భారీ ప్రమాదం అంచున నిలిచిన ఈ ఘటనలో సమయస్ఫూర్తి ప్రదర్శించిన ఫైర్ సిబ్బందిని అధికారులు అభినందించారు. ఇటువంటి ప్రమాదాలు పునరావతం కాకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని వారు సూచించారు. సంఘటన స్థలాన్ని ఎడిఎఫ్ఒ రంజిత్ కుమార్ పరిశీలించారు. ఫైర్ స్టేషన్ సిబ్బంది ఆదర్శ, హనుమంతు రావు, గణేష్, రామిరెడ్డి, బాబుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లిలో మూడంతస్తుల భవనంలో అగ్ని ప్రమాదం

రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లిలోనూ ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించడంతో భారీ ప్రాణ నష్టం తప్పింది.మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మెగాల్స్ కాలనీలోని మూడు అంతస్తుల భవనంలో ఒక్కసారిగా మొదటి అంతస్తులో మంటలు వ్యాపించాయి. అందులో ఉన్న వారు వెంటనే బిల్డింగ్ మూడంతస్తుల పైకెక్కి రక్షించాలని పెద్ద ఎత్తున కేకలు వేశారు. ఇది గమనించిన స్థానికులు వెంటనే ఫైర్ సిబ్బందికి, స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మొదటి అంతస్తులో వ్యాపించిన మంటలను అదుపులోకి తెచ్చారు. భవనంపైన ఉన్న ప్రజలను సురక్షితంగా కిందికి తీసుకుని వచ్చారు. ఈ అగ్ని ప్రమాదానికి విద్యుత్ షార్ట్‌సర్క్యూటే కారణమని ఫైర్ సిబ్బంది ప్రాథమికంగా అంచనాకు వచ్చారు.

నకిలీ వైద్యులపై కేసులు

- తెలంగాణ మెడికల్ కౌన్సిల్
- నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల్లో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజలను మోసం చేస్తూ చట్టవిరుద్ధంగా డాక్టర్లుగా చెలామణి అవుతున్న పలువురిపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేసింది. కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ డి.లాలయ్య, చైర్మెన్ డాక్టర్ కె.మహేశ్ కుమార్ ఈ మేరకు ఫిర్యాదు చేశారు. వీరు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ), టీఎస్ఎంపీఆర్ చట్టాలను ఉల్లంఘించినట్టు వారు పేర్కొన్నారు. నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ముగ్గురిపై, నల్లగొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో నలుగురిపై, మునుగోడు పోలీస్ స్టేషన్‌లో ఇద్దరిపై, తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. అదే విధంగా నిజామాబాద్ పట్టణంలోని ఖలీల్ వాడి ప్రాంతంలో ఆప్టోమెట్రి టెక్నీషియన్, నకిలీ కంటి వైద్యులు డి.సతీష్‌పై, మరో నకిలీ వైద్యులు, ఆర్ఎంపీ మొహమ్మద్ సందానిపై నిజామాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. వీరంతా ఆర్ఎంపీ, పీఎంపీలుగా పేర్కొంటూ తామూ వైద్యులమేనంటూ నమ్మిస్తూ ఇష్టారీతిన యాంటిబయాటిక్, స్టెరాయిడ్స్, నొప్పి నివారణ ఇంజెక్షన్లను రోగులకిస్తూ ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్నట్టు తనిఖీ అధికారులు గుర్తించారని వారు తెలిపారు. ఆర్ఎంపీ అని బోర్డు పెట్టుకుని అక్రమంగా అల్లోపతి వైద్యం చేస్తున్న వారిపై 91543 82727 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని కౌన్సిల్ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మెన్ డాక్టర్ వి.నరేష్ కుమార్ ప్రజలను కోరారు.

మద్యం ధర పెంపు

- క్వార్టర్‌కు రూ.10, ఫుల్ బాటిల్‌కు రూ.40

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మందుబాబులకు రాష్ట్ర ప్రభుత్వం షాకిచ్చింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఒక్కో బీర్ బాటిల్‌పై రూ.30 పెంచిన ప్రభుత్వం తాజాగా మద్యం ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. మద్యం సరఫరా కోసం లిక్కర్ కంపెనీలతో చేసుకున్న ఒప్పందం జూన్ 30తో ముగియనున్న నేపథ్యంలో ధరల కమిటీ సిఫారసు, మద్యం కంపెనీల విజ్ఞప్తి మేరకు రేట్లను పెంచినట్టు భావిస్తున్నారు. విస్కీ, బ్రాందీ క్వార్టర్‌పై రూ.10, ఆఫ్ బాటిల్‌పై రూ.20, ఫుల్ బాటిల్‌పై రూ.40 చొప్పున ధరలను పెంచింది. ఈ మేరకు తెలంగాణ ఎక్సైజ్ శాఖ ఆదివారం సర్క్యూలర్ జారీ చేసింది. పెరిగిన ధరలు ఈ నెల 19 నుంచి అమలులోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే, చీప్ లిక్కర్ ధరల్లో ఎలాంటి మార్పులుండబోవని పేర్కొంది. పెరిగిన ధరల వల్ల రాష్ట్రానికి దాదాపు రూ.3,500 కోట్ల అదనపు ఆదాయం సమకూరనుంది.

గత నెలలోనే నిర్ణయం

మద్యం ధరలను పెంచాలని గత నెలలోనే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రిటైర్డ్ జడ్జి జైస్వాల్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ బీర్లు, లిక్కర్ ధరలను పెంచాలని గతేడాది చివర్లోనే ప్రభుత్వానికి సిఫారసు చేసింది. బీర్లు, లిక్కర్ ధరలను ఒకే సారీ పెంచితే ప్రజల్లో వ్యతిరేకత వస్తుందనే భయంతో విడతల వారీగా పెంచుకుంటూ వచ్చారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం ఫిబ్రవరిలో బీర్ల ధరలను 15 శాతం పెంచింది. ఫలితంగా అన్ని రకాల బీర్లపై సగటున రూ.30 వరకు పెరిగింది. తాజాగా క్వార్టర్‌పై రూ.10, ఆఫ్ బాటిల్‌పై రూ.20, ఫుల్ బాటిల్‌పై రూ.40 చొప్పున పెంచింది.

మా రాయబారులు మీరే

- మళ్లీ మళ్లీ రాష్ట్రానికి రావాలి : మంత్రి జూపల్లి
- సచివాలయాన్ని సందర్శించిన సుందరీమణులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మిస్ వరల్డ్ పోటీదారులంతా తెలంగాణ రాష్ట్రానికి రాయబారులని పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయాన్ని మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించారు. పోటీదారులంతా కలిసి గ్రూప్ ఫోటో దిగారు. ఇండియాతో సహా 10 దేశాల పోటీదారులు తెలంగా ణ తల్లి విగ్రహానికి పుష్పార్చన చేశారు. అనంతరం ప్రభుత్వం ఇచ్చి తేనీటి విందును స్వీకరించారు. తెలంగాణ చరిత్ర, వారసత్వం, వంటకాలు, భిన్నమతాల కలిసిమెలిసి జీవించే జీవనశైలి, పర్యాటక ప్రదేశాలను గురించి వివరించే వీడియోలను తిలకించారు. అనంతరం సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ రైజింగ్ కు సంబంధించి నిర్వహించిన డ్రోన్ షోను ఎంజాయ్ చేశారు. సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. సచివాలయ పరిసరాల్లో కలియతిరిగారు. గుల్జార్ హౌజ్ అగ్ని ప్రమాద ఘటనలో మరణించిన వారికి సంతాపసూచకంగా మౌనం పాటించి నివాళులర్పించారు.

తేనీటి విందు సందర్భంగా జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రం, ప్రత్యేకంగా హైదరాబాద్ లైఫ్ సైన్సెస్, ఎమర్జింగ్ టెక్నాలజీ తదితర రంగాలకు పెట్టింది పేరని తెలిపారు. బంగారు తెలంగాణ దిశగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. పోటీదారులను తాము కేవలం పోటీదారులుగా భావించడం లేదనీ, తమ అతిథులుగా, రాయబారులుగా చూస్తున్నట్టు తెలిపారు. తిరిగి వెళ్లేటప్పుడు కేవలం ఇక్కడి జ్ఞాపకాలతో మాత్రమే కాకుండా తెలంగాణ హృదయంలోని ఒక భాగాన్ని తమతో తీసుకెళ్లాలని కోరారు. పర్యాటకం అనేది కేవలం ఉల్లాసం కోసం మాత్రమే కాదనీ, అవసరం ఉన్న ప్రజలకు సహాయపడేదనీ, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనకు ఉపయోగపడుతున్నదని చెప్పారు. తెలంగాణ అభివృద్ధి కోసం మిస్ వరల్డ్ పోటీలను రాష్ట్రానికి తీసుకొచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన కతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర సచివాలయం తెలంగాణ ఆకాంక్షలకు, ప్రగతి చిహ్నమని తెలిపారు.

రాష్ట్రంలో విషాద ఘటన చోటు చేసుకుందని జూపల్లి ఆవేదన వ్యక్తం చేశారు. గుల్జార్ హౌజ్ అగ్ని ప్రమాద ఘటన లో 17 మంది మరణించగా, అందులో 8 మంది అమాయక చిన్నారులు కూడా ఉన్నారని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వంగానే కాకుండా మనుషులుగా మానవత్వంతో స్పందిస్తున్నట్టు తెలిపారు.

అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మిస్ వరల్డ్ పోటీదారులకు స్వాగతం తెలిపారు. సచివాలయం పనితీరును, వివిధ శాఖలు, ఉద్యోగుల గురించి సంక్షిప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతులశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ తదితర ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. తేనీటి విందులోని వంటకాల విశేషాలతో పాటు తెలంగాణ చరిత్ర, వారసత్వం, భవిష్యత్ ప్రణాళికలను ఐఏఎస్ అధికారులు దాసరి హరిచందన, కృష్ణ ఆదిత్య వివరించారు.

ప్రజాఉద్యమాలే ఊపిరిగా జీవించిన గొప్ప వ్యక్తి రఘుపాల్

- కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి
- బి వెంకట్, ఎం సాయిబాబు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రజా ఉద్యమాలే ఊపిరిగా జీవించిన గొప్ప వ్యక్తి రఘుపాల్ అనీ, ఆయన మరణం తీరని లోటు అని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం.సాయిబాబు పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆదివారం ఈ మేరకు వారు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. బాల్యం నుంచి చనిపోయే వరకు సిద్ధాంత నిబద్ధతతో పనిచేశారనీ, సాధారణ జీవితం గడిపి ఆదర్శప్రాయంగా నిలిచారని కొనియాడారు. నేటి తరానికి ఆయన ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. ఆయనతో తమకు ఉన్న ప్రత్యేక అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. మార్క్సిజం, లెనినిజం సిద్ధాంతాన్ని ఆచరణాత్మకంగా సమకాలీన పరిస్థితులకు వర్తింపజేస్తూ ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. యువ నాయత్వాన్ని తయారు చేయడంలో ఆయన ముందువరుసలో ఉండేవారని పేర్కొన్నారు. ఇంటికొచ్చే పార్టీ సభ్యులను అప్యాయంగా చూసుకునేవారని చెప్పారు. మొన్నటి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లోనూ సిపిఎం అభ్యర్థుల తరపున నిర్విరామంగా పనిచేశారని తెలిపారు. హైదరాబాద్‌లో కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలోనూ ప్రధాన భూమిక పోషించారని గుర్తుచేశారు.

నగరంలో పేలుళ్ల కుట్రను భగ్నం చేసిన కౌంటర్ ఇంటిలిజెన్స్

- ఇద్దరు ఐసిస్ ఉగ్రవాదుల అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో పేలుళ్లకు కుట్ర పన్నిన ఇరాక్, సిరియా, ఇస్లామిక్ సేట్ (ఐసిస్) ఉగ్రవాద సంస్థకు చెందిన ఇద్దరిని తెలంగాణ, ఆంధ్ర కౌంటర్ ఇంటిలిజెన్స్ విభాగాలు అరెస్ట్ చేశాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని బోయగూడకు చెందిన సమీర్, ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరానికి చెందిన సిరాజ్‌లు కొంత కాలం క్రితం సౌది అరేబియాకు వెళ్లారు. ఆక్కడి నుంచి తిరిగొచ్చిన తర్వాత వారు హైదరాబాద్‌లో ఆరు చోట్ల పేలుళ్లకు కుట్ర పన్నినట్టు కౌంటర్ తెలంగాణ, ఆంధ్ర కౌంటర్ ఇంటిలిజెన్స్ విభాగాలకు ప్రత్యేక సమాచారం అందింది. ఐసీస్ ఉగ్రవాద సంస్థ కార్యకలాపాలతో ప్రేరేపితమైన వీరు పేలుడు పదార్ధాలను సమీకరించి వ్యూహరచన చేసినట్టు తేలింది. వీరి కదలికపై గత కొంత కాలంగా నిఘా ఉంచి ఇరు రాష్ట్రల కౌంటర్ ఇంటిలిజెన్స్ అధికారులు సంయుక్త ఆపరేషన్ చేసి ఆరెస్ట్ చేశాయి. వీరి దగ్గరి నుంచి పేలుడు పదార్థాలు స్వాదీనం చేసుకున్నారు. అయితే ఐసిస్‌తో వారికి ఎప్పటి నుంచి సంబంధాలున్నాయి? హైదరాబాద్‌లో పేలుళ్లకు ఈ ఇద్దరిని ఎవరు ప్రేరేపించారు? ఐసిస్‌లో ఎవరితో వారికి సంబంధాలున్నాయి? వారు ఎంత మందిని ఐసిఎస్ భావజాలం పైపు ప్రేరేపించారు తదితర కోణాల్లో కౌంటర్ ఇంటిలిజెన్స్ విభాగాం అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. వారిద్దరి అరెస్ట్‌కు సంబంధించి సమాచారం అందుకున్న ఎన్ఐఎ అధికారులు సైతం వారిని విచారించడానికి సమాయత్తం అవుతున్నట్టు తెలిసింది.